క్లుప్తంగా

నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు



మేడికొండూరు: మండలంలోని పాలడుగు గ్రామంలో ఈ నెల 2 నుంచి జరుగుతున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి ఐదురోజుల బ్రహ్మోత్సవాలు నేటితో ముగియనున్నాయి. వేడుకల్లో గ్రామ పరిసర ప్రాంతాలనుంచి భక్తులు ఎక్కువమంది పాల్గొని మెక్కుబడులు చెల్లించుకున్నారు. నాలుగవరోజు శనివారం సుప్రభాతసేవ, నిత్యఅర్చన, నిత్యహోమం, గ్రామ బలిహరణ, రథోత్సవం, ఆంజనేయస్వామి ఆకుపూజ, నవగ్రహహోమం, పలురకాల పూజాకార్యక్రమాలు జరిగాయి. ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు భక్తులకు ఆకర్షించారు. ఆలయ అర్చకులు టి.శేషు, శేఖర్‌బాబు, తూమాటి మురళి పాల్గొన్నారు.

ఘనంగా ఈమని పాఠశాల వార్షికోత్సవం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 76వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దుగ్గిరాల జడ్పీటీసీ మేకతోటి అరుణ, మండల విద్యాశాఖ అధికారి ఎం.శ్రీనివాసరావులు విచ్చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పాఠశాల హెచ్ఎం ఎం.ఏడుకొండలు, అతిథులు వివిధ అంశాలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ బొంతు కోటయ్య, కొల్లిపర సుబ్బారావు, అందే రామ్మోహనరావు, పాఠశాల పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోదండ రామాలయ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.లక్ష అందజేత



తాడేపల్లిరూరల్: మంగళగిరి శాసనసభ్యుడు ఆర్కే దుగ్గిరాల మండల పరిధిలో పర్యటించిన సందర్భంలో చినపాలెం గ్రామంలో ప్రస్తుతమున్న రామాలయం శిథిలావస్థకు చేరుకుందని నూతనంగా రామాలయం నిర్మిస్తున్నట్లు కమిటీవారు తెలియజేయడంతో వెంటనే స్పందించిన ఆయన రూ.లక్ష సహాయాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారు. శనివారం ఎమ్మెల్యే ప్రకటించిన రూ.లక్ష సహాయాన్ని దుగ్గిరాల ఎంపీటీసీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణలు కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), తాడిబోయిన సుబ్బారావు, గోపి, పెరుకల పూడి సర్పంచ్ గంపల గంగాధర్, వెంకటేశ్వరరావు, మేరుగ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా జ్యోతుల ప్రదర్శన



మంగళగిరి: నృసింహస్వామి మాల ధరించిన స్వాములు శనివారం రాత్రి జ్యోతుల ప్రదర్శన నిర్వహించారు. జ్యోతులతో తొలుత నృసింహ స్వామి కొండ చుట్టూ గిరి ప్రదక్షణ నిర్వహించి ఆలయానికి చేరుకుని ఆలయంలో జై నరసింహ... జైజై నరసింహ... అంటూ పెద్ద ఎత్తున నినదించడంతో ఆలయం మార్మోగింది.

16న ఓంకార ఆశ్రమ స్థలం లీజుకు బహిరంగ వేలం

తెనాలిటౌన్: పట్టణ బుర్రిపాలెం రోడ్డులో ఉన్న శ్రీ ఓంకార ఆశ్రమానికి సంబంధించిన ఖాళీ స్థలం లీజుకు బహిరంగ వేలాన్ని ఈ నెల 16న షరాఫ్‌బజార్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల కాల పరిమితిలో స్థలాన్ని లీజుకు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన షాపును మూడు సంవత్సరాల కాలములన్నింటికి లీజుకు సంబంధించి అదే రోజు ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రామలింగేశ్వరపేటలోని రామేశ్వరస్వామి దేవస్థానంకు సంబంధించి, వైకుంఠపురం పక్కన గల 0-49సెంట్లు ఖాళీ స్థలాన్ని లీజుకు మూడు సంవత్సరాల కాల పరిమితికి బహిరంగ వేలం, అదే రోజు మధ్యాహ్నం 12గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

సొంత మగ్గం.. ఉపాధికి మార్గం

- రాజీవ్ గృహకల్ప వద్ద 144 మగ్గాలకు షెడ్ల నిర్మాణాలు
- నెరవేరనున్న మహానేత వైఎస్సార్ ఆశయం
- రూ.2కోట్లతో కొనసాగుతున్న పనులు
- 1200 కుటుంబాలకు ఉపాధి లభించే అవకాశం



పూర్తి కావస్తున్న చేనేత మగ్గాల షెడ్లు



ఇంట్లోనే మగ్గం నేస్తున్న కార్మికురాలు

మంగళగిరి: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాన్ని ఆయన కుమారుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారు. వైఎస్సార్ హయాంలో పట్టణంలో నల్లచెరువులో రాజీవ్ గృహకల్ప పేరుతో గృహసముదాయం నిర్మించారు. అత్యధికంగా చేనేత కార్మికులకు ఇళ్లను కేటాయించడంతో వారికి ఉపాధి కల్పించేందుకు మగ్గం షెడ్ల నిర్మాణానికి గృహసముదాయం బ్లాక్‌ల మధ్యలో స్థలాన్ని కేటాయించారు. అయితే మహానేత వైఎస్సార్ మృతితో ఆ పథకం అటకెక్కింది. దీంతో నేతన్నలు తమ ఇళ్లలోనే మగ్గాలు ఏర్పరుచుకుని ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రాజీవ్ గృహకల్పను సందర్శించిన ఎమ్మెల్యే ఆర్కే నేతన్నల కష్టాలను తెలుసుకుని వెంటనే మగ్గాల షెడ్ల నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మగ్గాల షెడ్ల నిర్మాణాలకు చేనేత జౌళి శాఖ నుంచి రూ.కోటి, నగర పాలక సంస్థ నుంచి మరో రూ.కోటి మొత్తం రూ.2 కోట్లు కేటాయింపచేసి మగ్గాల షెడ్ల నిర్మాణం చేపట్టగా చక చకా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మొత్తం 6 మగ్గాల షెడ్ల నిర్మాణాలలో ఒక్కో షెడ్డులో 24 మగ్గాలు వచ్చేలా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మగ్గాల షెడ్లలో 144 మగ్గాలు ఏర్పాటు చేసి 144 మంది సొంత మగ్గం లేని లబ్ధిదారులను ఎంపిక చేసి కేటాయిస్తారు.

ఒక్కో మగ్గంతో 8 కుటుంబాలకు ఉపాధి..

ఒక్క మగ్గం ద్వారా మగ్గం నేసే నేతన్నతో పాటు చేనేత అనుబంధవృత్తులైన రంగుల అద్దకం, ఆసుతోడటం, పడుగు చేయడం, అచ్చులు అతకడం, మొలకట్టడం, మగ్గం నేయడం, హోల్‌సేల్ మార్కెటింగ్, రీటైల్ మార్కెటింగ్ ఇలా 8 కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. రాజీవ్ గృహకల్ప వద్ద నిర్మిస్తున్న మగ్గాల షెడ్ల ద్వారా సుమారు 1200 చేనేత కుటుంబాలకు ఉపాధి లభిస్తుండడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ ఆశయం నెరవేరి, చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది. మగ్గాల షెడ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

ఎన్నో కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది..



సొంతమగ్గాలతో ఉపాధి మెరుగుపడడంతో పాటు ప్రభుత్వ పథకాలు వస్తాయి. రాజీవ్ గృహకల్ప వద్ద నిర్మిస్తున్న మగ్గాల షెడ్లతో ఎన్నో కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధికి మగ్గాల షెడ్లు ఎంతో అండగా నిలుస్తాయి. నేత పరిశ్రమ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే చేస్తున్న కృషి అభినందనీయం.

– అందె వెంకటరత్నం, చేనేత కార్మికురాలు

సీఎం జగన్, ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు..



మంగళగిరి గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పటికే ప్రగడ కోటయ్య, వైఎస్సార్‌ల పేరుతో పాతబస్టాండ్ సెంటర్‌లో చేనేత భవనం నిర్మిస్తున్నారు. రాజీవ్ గృహకల్ప కాలనీ వద్ద మగ్గాల షెడ్ల కోసం కేటాయించిన స్థలాలు ఎన్నో సంవత్సరాల నుంచి నిరుపయోగంగా ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. తొలిసారిగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చేనేత మగ్గాల షెడ్ల నిర్మాణాలకు ఉపక్రమించడంతో వందల చేనేత కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. మగ్గాల షెడ్ల నిర్మాణం పూర్తయి లబ్ధిదారులకు కేటాయిస్తే ఎన్నో వందల కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధిస్తాయి. చేనేత మగ్గాల షెడ్ల నిర్మాణం చేపట్టి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ఆర్కేకు కార్మికులంతా అండగా నిలుస్తారు.

– సిరిశెట్టి అప్పారావు, చేనేత కార్మికుడు

'గడప గడప' సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

విద్యుత్ అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి



విద్యుత్ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

తాడికొండ: విద్యుత్ శాఖపై గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలి తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి సూచించారు. శనివారం గుంటూరులోని తన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారితో మాట్లాడుతూ గ్రామాలో ప్రమాదకర రీతిలో విద్యుత్ స్తంభాలను గుర్తించి వెంటనే సరిచేయడం లేదా కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. లో ఓల్టేజ్ కారణంగా మోటార్లు, మీటర్లు చెడిపోతున్నాయని ఫిర్యాదులు వచ్చాయని అవి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకొని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గంలోని జగనన్న కాలనీలలో 90 శాతం విద్యుత్ సౌకర్యం కకల్పించడం జరిగిందని, పేరేచర్లలో రూ. 4 కోట్లతో నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో 4 మండలాల విద్యుత్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలి

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



సీకే బాలికోన్నత పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: ప్రతి స్త్రీ విద్యార్థి దశ నుంచే మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. నగరంలోని సీకే బాలికోన్నత పాఠశాల 41వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 41 సంవత్సరాల చరిత్ర కలిగిన సీకే బాలికోన్నత పాఠశాలను ఇటీవల ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డితో కలసి తాను సందర్శించడం జరిగిందని, పాఠశాలను మరింత అభివృద్ధి చేసేందుకు పలు నిర్మాణాల నిమిత్తం సంబంధిత అధికారులకు తగు సూచనలు చేసినట్లు తెలిపారు. పలువురు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్మశాన భూమి ఏర్పాటు చేయాలంటూ వినతి



తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న పాస్టర్ కె.కె.రవికుమార్

తాడేపల్లిరూరల్: శ్మశాన భూమిని ఏర్పాటు చేయాలంటూ తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డిని శనివారం డోలాస్‌నగర్ బాప్టిస్టు చర్చి పాస్టర్ కె.కె.రవి కుమార్, సంఘస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాస్టర్ రవికుమార్ మాట్లాడుతూ తాడేపల్లి కృష్ణనగర్ పాత పంచాయతీ కార్యాలయం ప్రస్తుతం సచివాలయం పక్కనే వున్న భూమిని దశాబ్దాలుగా ప్రజలు శ్మశాన వాటికగా ఉపయోగించుకుంటున్నారని, ఇటీవల కాలంలో అది నిండిపోయిందని, ఒక మృతదేహాన్ని ఖననం చేయాలంటే మరో సమాధిని తవ్వి పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు తహసీల్దార్ నాగిరెడ్డిని కలసి వినతి పత్రం అందజేశామని తెలిపారు. కొత్తగా భూమిని వెతికే పని లేకుండా ప్రస్తుతమున్న శ్మశాన ప్రహరీ వెనుకనే స్థలం అన్యాక్రాంతం కాకుండా పడమర దిశలో ఉన్న భూమిని మాకు కేటాయించవలసినదిగా అభ్యర్థించామని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కె.కె.సుజాత, సంఘ పెద్దలు వై.యోహోషువా, పి.నాని, వై.జాన్సన్, కెనడి, కన్యకుమార్, సంపత్, లెనిన్ ఉన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

- 13 మంది జూదరులు అరెస్ట్
- రూ.2.12లక్షలు, 14 సెల్‌ఫోన్‌లు, 3 కార్లు స్వాధీనం



అర్ధరాత్రి పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): ఎస్‌ఈబీ అధికారుల దాడులలో 13 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేయడంతో పాటు నగదు, సెల్‌ఫోన్‌లు, వాహనాలు స్వాధీనం చేసుకున్న ఘటన తుళ్ళూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో జరిగింది. వివరాలు.. ఎస్‌ఈబీ అధికారులకు అందిన సమాచారం మేరకు శుక్రవారం అర్ధరాత్రి ఉద్దండరాయునిపాలెం గ్రామంలో పేకాట స్థావరాలపై తమ సిబ్బందితో దాడులు నిర్వహించగా 13 మంది జూదరులు, రూ.2,12,000 నగదు, 14 సెల్‌ఫోన్‌లు, 3 కార్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఎస్‌ఈబీ సీఐ మారయ్య బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడులలో ఎస్‌ఈబీ ఎస్ఐ మల్లిఖార్జునరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

హకీంజానికి సరసభారతి ఉగాది పురస్కారం



షేక్ అబ్దుల్ హకీంజాని

తెనాలి: కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన సాహిత్య, సాంస్కృతిక సంస్థ సరస భారతి వార్షిక ఉగాది పురస్కారానికి తెనాలికి చెందిన బాలసాహిత్యవేత్త, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీంజాని ఎంపికయ్యారు. సంస్థ అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్ నుంచి ఈమేరకు ఆహ్వానం అందింది. గత మూడు దశాబ్దాలుగా హకీంజాని సాహితీ సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాన్ని ప్రకటించినట్టు తెలియజేశారు. ఈనెల 19వ తేదీ సాయంత్రం సరస భారతి ఆధ్వర్యంలో జరగనున్న శోభకృత్ ఉగాది వేడుకల్లో ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. హకీంజాని బాలసాహిత్యంలో 36 పుస్తకాలు, 270 కథలు, 30 వయోచన వాచకాలతో కలుపుకొని 71 పుస్తకాలను రచించారు. మహారాష్ట్రలో 11, 12 తరగతుల పాఠ్యపుస్తకాల్లో హకీంజాని కథలను చేర్చారు. వీరి కృషికి గాను పలు అవార్డులు లభించాయి.

చిరు వ్యాపారులకు అండగా ఎమ్మెల్యే ఆర్కే

సొంత ఖర్చులతో ఐదు తోపుడు బండ్లు అందజేత



తోపుడు బండ్లను అందజేస్తున్న దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిరు వ్యాపారులకు మంగళగిరి శాసనసభ్యులు అండగా నిలిచారు. వారి కోసం సొంత ఖర్చులతో తోపుడు బండ్లను అందజేశారు. శనివారం ఈ తోపుడు బండ్లను దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, ఈమని సొసైటీ చైర్మన్ నలుకుర్తి ఏసుపాదంలు అందజేశారు. ఈమని గ్రామానికి చెందిన దాసరి సాంబయ్య, ఎం.వెంకటేశ్వరరావు, పురిముట్ల ముత్త మ్మ, వల్లభాపురపు నాగేశ్వరరావు, చోడవరపు శ్రీనివాసరావులు చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుండడంతో వారికి ఈ తోపుడు బండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు (డివిఆర్), దుగ్గిరాల మైనార్టీ నాయకులు షేక్ సుభాని, పిల్లి ధర్మరత్నం, మత్తె ఆనంద్ పాల్గొన్నారు.

బండారుపల్లి మేజర్‌ను పరిశీలించిన కత్తెర సురేష్



నీటి ప్రవాహాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

బండారుపల్లి(తాడికొండ): తాడికొండ, మేడికొండూరు మండలాల్లో బండారుపల్లి మేజర్ ద్వారా సాగు, తాగునీటి ఎద్దడి కారణంగా రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ స్వయంగా పరిశీలించారు. శనివారం ఆయా మండలాల్లో పర్యటించిన ఆయన సాగునీటి ప్రవాహాన్ని పరిశీలించి రైతులతో ముచ్చటించారు. బండారుపల్లి మేజర్‌లో శివారు భూములు కావడంతో తమ మండలాల్లో సరిపడా సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని పలువురు తెలిపారు. సాగునీటికే నీరు సరిపోకపోవడంతో గ్రామాల్లోని తాగునీటి చెరువులు నింపే పరిస్థితి లేక నీరు పూర్తిగా అడుగంటిందని తెలిపారు. సకాలంలో నీరందకపోతే మిర్చి పంటలు దెబ్బతిని ఆరుగాలాలు శ్రమించి పండించిన పంటలు ఎండిపోయి రైతులకు తీవ్రర నష్టం వస్తుందని తెలిపారు. స్పందించిన సురేష్ కుమార్, ఈ విషయంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో చర్చించడం జరిగిందని, ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి

తాడికొండ: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తాడికొండ ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మీ సూచించారు. శనివారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పలు విభాగాల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన ఎంపీపీ ప్రధానంగా తాగునీటి సమస్యపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పలు గ్రామాల్లో ప్రజలు గాయాల పాలవుతున్నారని ప్రజల నుంచి ఒత్తిడి అధికం అవుతుందని వస్తున్న ఫిర్యాదులపై చర్చించారు. అనంతరం గృహ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి ఉగాదికల్లా లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీఓ బిక్కి మహేష్ బాబు, డిప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్, ఎంఈఓ తెనాలి ఇందిర, పలువురు మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శనివారం ఆల్ గ్రీన్ ఫీల్డ్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు మొక్కలు నాటారు. ఆల్ గ్రీన్ ఫీల్డ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డోగిపర్తి శైలజ సహకారంతో ఆల్ గ్రీన్ ఫీల్డ్స్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫీల్డ్స్ ప్రతినిధి రత్నకుమారి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రీతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహదం చేస్తాయని, పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలను పెంచుటకు ఏర్పాటు చేస్తామని చెప్పారు. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటడానికి ముందుకు వచ్చిన సేవా సంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొని తీవ్ర గాయాలు



గాయపడిన ద్విచక్రవాహనదారుడు ఇసాక్

మంగళగిరి: ఎదురుగా వెళుతున్న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేయబోయి మరో ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఓ ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయవాడకు చెందిన మర్యం ఇసాక్ తన ద్విచక్ర వాహనంపై శనివారం తెనాలి వెళుతున్నాడు. మార్గ మధ్యలోని ఆత్మకూరు కోకోకోలా కంపెనీ వద్దకు వెళ్లే సరికి ఎదురుగా వెళుతున్న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేయబోయి ద్విచక్ర వాహనం అదుపు తప్పి తెనాలి వైపు నుంచి మంగళగిరి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇసాక్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఛలో ఢిల్లీ ర్యాలీని జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: ఏప్రిల్ 5న ఢిల్లీలో జరగనున్న కార్మిక కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని గుంటూరు జిల్లా రైతు సంఘం నాయకుడు జొన్నా శివ శంకరరావు అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాక గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంపాదనంతా కార్పొరేట్లకు దోచి పెడుతోందని, దేశ ప్రజలపై మరింత పన్నుల భారాన్ని మోపి ప్రజలు జీవించలేని స్థితికి వచ్చేలా చేసిందని అన్నారు. ఢిల్లీలో ఏప్రిల్ 5న జరిగే ర్యాలీకి వేలాదిగా కార్యకర్తలు, రైతు సంఘాలు తరలి రావాలని అన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు ఎస్కే ఎర్రపేరు, టి.బక్కిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొర్రపాడులో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

మేడికొండూరు: ఇంటి వద్దనే ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంప్ శనివారం మండలంలోని కొర్రపాడులో జరిగింది. ఈ కార్యక్రమలో మండల వైద్యాధికారి సిద్దిక్ పాల్గొన్నారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో 70 రకాల మందులు, 14రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉన్నాయని తెలిపారు. ఏడుగురు గర్భిణులు, ఐదుగురు బాలింతలు, 116మంది బీపీ, థైరాయిడ్, గుండెజబ్బువంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు, వృద్ధులకు వైద్యసేలు అందించి వారికి ఉచితంగా మందులు పంపిణీచేయడం జరిగిందని వైద్యాధికారి తెలిపారు. సిహెచ్ఓ పి.నరేష్, కొర్రపాడు సర్పంచి నాగ మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హై రిస్క్ కేసులను గుర్తించాలి

ఫిరంగిపురం: ప్రతి గ్రామంలో హైరిస్క్‌లను ఆరోగ్యసిబ్బంది గుర్తించి సంబంధిత యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడు చేయాలని డీపీహెచ్ఎన్ సురేఖ అన్నారు. మండలంలోని వేములూరిపాడు సచివాలయం వద్ద వ్యాక్సినేషన్ సెంటర్‌ను శనివారం సురేఖ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రొటీన్ ఇమ్యునైజేషన్‌లో భాగంగా బుధ, శనివారాల్లో ఆరోగ్యసిబ్బంది అన్ని రకాల వ్యాక్సిన్లు తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలన్నారు. దానితో పాటుగా గర్భిణులలో హైరిస్క్ ఉన్నవారిని గుర్తించి వారి వివరాలు యాప్‌లో అప్‌లోడు చేసినట్లయితే తగిన చికిత్సను అందించడం ద్వారా మాతాశిశుమరణాలు తగ్గించినట్లు అవుతుందని తెలిపారు. గర్భిణులకు సంబంధించిన పూర్తి సమాచారంతో పాటు ఆధార్, ఫోన్‌నెంబర్, బ్యాంకు అకౌంటు జిరాక్స్ డెలివరీ సమయంలో వారివెంట తీసుకువెళ్లేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వ్యాక్సినేషన్ రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సర్వీసులపై ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలను ప్రశ్నించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెవెంట వహీద, పీహెచ్ఎన్ గాయత్రీదేవి, ఏఎన్ఎం ఆంథోని రాణి, ఆశ కార్యకర్తలు సుజాత, పద్మ, శాంతరాణి, శాంతకుమారిలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డీఎం రాంబాబు

ఫిరంగిపురం: ప్రతి వినియోగదారుడు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎల్‌డీఎం ఇ.రాంబాబు అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో శనివారం గుంటూరు రూరల్, మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల బ్యాంకు మేనేజర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎల్‌డీఎం రాంబాబు మాట్లాడుతూ తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి లోన్‌కావాలనో, డ్రా వచ్చిందనో, బహుమతి వచ్చిందనో చెప్పి వారు ఇచ్చిన లింకును కాదనో, అవునో నొక్కమని చెప్పినట్లయితే అటువంటివి తిరస్కరించాలని, ఎటువంటి లింకును నొక్కకూడదన్నారు. అదేవిధంగా ఓటీపీ వచ్చిందనో, పిన్‌నెంబర్ చెప్పమనో అడిగినా అటువంటి వాటిని చెప్పకూడదని అలా చెప్పినట్లయితే ఆన్‌లైన్ ద్వారా నగదును వారు డ్రాచేసుకొనే అవకాశం ఉంటుందని అటువంటి వాటిపై వినియోగదారులకు బ్యాంకు మేనేజర్లు తెలియజేసి అప్రమత్తం చేయాలని చెప్పారు. ప్రభుత్వం సూచించిన విధంగా డ్వాక్రామహిళలకు రుణాలు, అర్హులైన వారికి బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో డీడీఎం నాబార్డ్, కేఆర్టీ కార్తిక్, ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ బ్రహ్మనందకుమార్, స్టేట్‌బ్యాంకు నోడల్ అధికారి సీహెచ్ ఆనంద్‌కుమార్, యూనియన్ బ్యాంకు సీనియర్ మేనేజర్ ఇ.రాధిక, ఫీల్డ్ అధికారి క్రాంతికుమార్, పలు బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

క్లారినెట్ కళాకారుడు శ్యామ్‌కు సత్కారం

తెనాలి: పట్టణంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి మహోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన సభలో ఎన్టీఆర్ వ్యక్తిత్వం, ఆయన నటించిన సినిమాలు, రాజకీయ జీవితంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు.